నష్టపోయిన రైతుకు సాయమేది?

- ఎర్ర కాలువ, గోదావరి వరదలతో రైతులకు అపార నష్టం
- ఇంతవరకూ ఎలాంటి సాయం ప్రకటించని కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా, పంట నష్టపరిహారం అందజేత
- ఇప్పటికీ అందని ఖరీఫ్ పెట్టుబడి సాయం



కంసాలిపాలెంలో ఎర్ర కాలువ ముంపుతో కుళ్లిపోయిన వరి పొలం

నిడదవోలు రూరల్: విత్తు నాటిన దగ్గర నుంచి పంట చేతికొచ్చే వరకూ ప్రకృతి వైపరీత్యాలతో రైతుకు అడుగడుగునా గండమే. ఎర్ర కాలువ, గోదావరి వరదలు, తుపానులు, భారీ వర్షాలు పంటలను దెబ్బతీస్తున్నాయి. ఇలాంటి తరుణంలో అండగా నిలవాల్సిన కూటమి ప్రభుత్వం నుంచి అన్నదాతలకు ఆర్థిక చేయూత కరవైంది. నీట మునిగిన పంటలను పరిశీలించిన మంత్రుల బృందం నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని హామీ ఇచ్చారే తప్ప ఇప్పటి వరకూ ఎలాంటి సాయం ప్రకటించలేదు. దీంతో బాధిత రైతులందరూ ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో 58,035 ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు. ఎర్ర కాలువ ముంపుతో నిడదవోలు మండలంలోని రావిమెట్ల, కంసాలిపాలెం, సింగవరం, తాళ్లపాలెం, తాడిమళ్ల, తిమ్మరాజుపాలెం, ఉండ్రాజవరం మండలంలోని కాల్దారి, పసలపూడి, సూర్యారావుపాలెం గ్రామాల పొలాలు నీటమునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరో పక్క గోదావరికి వరద పోటెత్తడంతో పెరవలి మండలంలోని వివిధ గ్రామాల లంకల్లో సాగవుతున్న పంటలన్నీ ఇప్పటికీ నీట మునిగి ఉన్నాయి.

నియోజకవర్గంలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా అందిన పరిహారం

మండలం	రైతులు	2020–21	2021–22	2022–23
నిడదవోలు	5,836	రూ.7.62 కోట్లు	రూ.18.26 కోట్లు	రూ.25.73 లక్షలు
పెరవలి	2,238	రూ.45 లక్షలు	రూ.05.15 కోట్లు	రూ.1.81 కోట్లు
ఉండ్రాజవరం	2,818	రూ.1.85 కోట్లు	రూ.22.02 కోట్లు	రూ.50.36 లక్షలు

నియోజకవర్గంలో ఎర్ర కాలువ వరద ముంపుతో నష్టపోయిన రైతులకు అందిన సాయం

మండలం	రైతులు	2020–21	2021–22
నిడదవోలు	5,877	రూ.45.82కోట్లు	రూ.27.41 కోట్లు
ఉండ్రాజవరం	2,488	రూ.2.99 కోట్లు	రూ.01.54 కోట్లు

అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

వరదలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన వరి, మొక్కజొన్న, చెరకు, అరటితో పాటు ఉద్యాన పంటల సాగుదారులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. సాగు చేసిన ప్రతి పంటనూ ఈ–క్రాప్‌లో నమోదు చేసి ఏ సీజన్‌లో నష్టపోతే ఆ సీజన్‌లోనే బాధితులకు పంట నష్టపరిహారాన్ని అందించింది. వైఎస్సార్ ఉచిత పంటల బీమా, పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) కింద 2020–21 నుంచి వరుసగా మూడేళ్ల పాటు రైతులకు పరిహారాన్ని చెల్లించింది. వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం ఏటా సీజన్ ముందే అందేది. మే నెలలో రూ.7,500, అక్టోబర్‌లో రూ.4 వేలు, జనవరిలో రూ.2 వేలు రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ అయ్యేది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులకు, దేవదాయ, అటవీ, వక్ఫ్ తదితర ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న కౌలుదారులకు అప్పటి ప్రభుత్వం ఏటా రూ.13,500 చొప్పున అందజేసింది. అయితే కూటమి ప్రభుత్వ నేతలు అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేలు చెల్లిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. కానీ నేటికీ ఈ సాయంపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. కూటమి ప్రభుత్వం నుంచి ఇంతవరకూ సాయం అందకపోవడంతో పెట్టుబడి కోసం కొంత మంది రైతులు అధిక వడ్డీలకు అప్పు చేయాల్సిన దుస్థితి నెలకొంది. దీనికి తోడు ఖరీఫ్ ఆరంభంలోనే ఎర్ర కాలువ, వరదలు వచ్చి అన్నదాతలను కోలుకోలేని దెబ్బతీశాయి.

రైతులను ఆదుకోవాలి



గతంలో రెండేళ్ల పాటు ఎర్ర కాలువ వరదల వల్ల రైతులు నష్టపోతే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎకరాకు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.34 వేలు, ఉచిత పంటల బీమా రూ.6 వేలు చెల్లించి అండగా నిలిచింది. ఈ ఖరీఫ్‌లో పంట మొత్తం ఎర్ర కాలువ వరదనీటిలో మునిగి కుళ్లిపోయింది. మళ్లీ సాగుచేద్దామంటే వరినారు కూడా లేదు. కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. ఉచిత బీమాతో పాటు తీవ్రంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి.

– మలిశెట్టి వీరప్రసాద్, రైతు, కంసాలిపాలెం

క్లుప్తంగా

నేటి నుంచి ఇంటింటికీ పెన్షన్ల పంపిణీ

ఉండ్రాజవరం: ఆగస్టు నెల ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి మండలంలో అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్టు ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి బుధవారం తెలిపారు. గురువారం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభం అవుతుందన్నారు. మండలంలో అన్నిరకాల పెన్షన్‌దారులూ కలిపి 10,479 మంది ఉన్నారన్నారు. వారందరికీ రూ.4.47 కోట్ల మొత్తాన్ని 159 మంది సచివాలయ సిబ్బంది, ప్రభుత్వోద్యోగుల ద్వారా ఇంటింటా పంపిణీ చేయిస్తామన్నారు.

బాలికా విద్యకు సహకరించాలి



మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద బేటీ బచావో.. బేటీ పడావో అవగాహన కార్యక్రమం

తాళ్లపూడి: బాలికల చదువుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీవాసవి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల బాలికలు, గర్భిణులు, బాలింతలతో కలసి అంగన్‌వాడీ వర్కర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు చదువు ప్రాముఖ్యత గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు శ్రీ వాసవి, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ భానుమతి, ఏఎన్‌ఎం కృష్ణవేణి, సచివాలయ సిబ్బంది సీహెచ్ శ్రీనివాస్, కె.వినీత, అంగన్‌వాడీ వర్కర్లు ఆర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ ఇంతియాజ్ మృతి

నిడదవోలు: పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్, విద్యాదీప్ పాఠశాల వ్యవస్థాపకుడు ఇంతియాజ్ అహ్మద్ మంగళవారం మృతి చెందారు. ఇంతియాజ్ 1995 నుంచి 2005 వరకూ టీడీపీ తరఫున కౌన్సిలర్‌గా పనిచేశారు. ముస్లిం హక్కుల పోరాట సమితి అధ్యక్షుడిగా పని చేశారు. విద్యాదీప్ స్కూల్ అధినేతగా అనేక మంది విద్యార్థులను ఉన్నత స్థితికి తీసుకు వచ్చారు. టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ షాజహాన్, రామదాసు సీతారామయ్య, రామకృష్ణ, సూరిబాబు, కరీం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంతియాజ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మద్యం షాపుల్లో సిబ్బందిని తొలగించ వద్దు

తాళ్లపూడి: ప్రభుత్వం నిర్వహిస్తున్న మద్యం షాపుల్లో పని చేస్తున్న సిబ్బందికి అన్యాయం జరగకుండా చూడాలని ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు కోరారు. అగ్రిమెంట్ గడువు పూర్తి కాకుండానే లిక్కర్ షాపుల్లో పని చేస్తున్న సిబ్బందిని అన్యాయంగా తొలగించాలని చూస్తున్నారని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకు వెళ్లారు. బుధవారం గజ్జరం గ్రామం వచ్చిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును ఎంపీపీ పోశిరాజు, గజ్జరం సర్పంచ్ గండి రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు గుంటి చిన్నబ్బాయి కలసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు ముగ్గురూ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినపుడు ఉద్యోగులను మార్చడం సర్వసాధారణం అన్నారు. అయితే అగ్రిమెంట్ మీద మద్యం షాపుల్లో నామమాత్రపు వేతనాలకు పనిచేసే ఉద్యోగుల పట్ల పునరాలోచించాలని కోరారు. రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీని ప్రకటించకుండానే, కేవలం ఒక్క తాళ్లపూడి మండలంలో సిబ్బందిని తొలగించే ప్రయత్నం సరి కాదని ఎంపీపీ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త మద్యం పాలసీ వచ్చే వరకూ మద్యం షాపుల్లోని ఉద్యోగులను కొనసాగించాలని కోరారు.

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి

నల్లజర్ల: రబీ ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. మే నెల నుంచి ధాన్యం బకాయిలు చెల్లించలేదని వారు చెబుతున్నారు. దాదాపు 576 మంది రైతుల వద్ద నుంచి సేకరించిన 6 కోట్ల 132.46 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ఇందు నిమిత్తం రైతులకు రూ.13 కోట్ల 38 లక్షలు చెల్లించాలి. ఇంత వరకు రూ.8 కోట్ల17 లక్షలు మాత్రమే చెల్లించారు. ఇప్పటికీ 233 మంది రైతులకు రూ.5 కోట్ల 21 లక్షలు బకాయిలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా రైతులకు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పిన చంద్రబాబు సర్కారు ఇంతవరకూ ఆ మాటే ఎత్తడం లేదని పోతవరానికి చెందిన రైతు సంఘ నాయకుడు పెండ్యాల వీరరాఘవులు పేర్కొన్నారు. వెంటనే రైతులకు పెట్టుబడి సాయం, ధాన్యం బకాయిలు అందించాలని కోరారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రూ.3 లక్షల వరకూ ఉన్న సున్నా వడ్డీని రూ.5 లక్షల వరకూ పెంచి రుణసౌకర్యం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరోపక్క ష్యూరిటీ లేకుండా కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని కౌలు రైతులు కోరుతున్నారు. ధాన్యం బకాయిల విషయమై ప్రజా ఫిర్యాదుల విభాగం కలెక్టరు కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేసినట్టు రైతు రాఘవులు తెలిపారు. రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయకముందే ధాన్యం బకాయిలు చెల్లించాలని కోరారు.

నిలకడగా గోదావరి ప్రవాహం



గోష్పాద క్షేత్రంలో స్నానఘట్టాన్ని ముంచెత్తి ప్రవహిస్తున్న గోదావరి

కొవ్వూరు: గోదావరి నదిలో వరద ప్రవాహం నిలకడగా ఉంది. స్థానిక గోష్పాద క్షేత్రంలోని స్నానఘట్టాలు ఇప్పటికీ పూర్తిగా ముంపులోనే ఉన్నాయి. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బుధవారం ఉదయం నుంచి ఆనకట్ట వద్ద వరద 12.10 అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతోంది. గోష్పాద క్షేత్రంలో ఒడ్డును తాకుతూ వరద ప్రవహిస్తోంది. క్షేత్రానికి వెళ్లే రహదారులను శుభ్రతపై కొవ్వూరు మునిసిపాలిటీ ఇంకా దృష్టి సారించలేదు. ఈ క్షేత్రం వరద ముంపు నుంచి తేరుకోవడంతో ఎక్కడికక్కడ బురద, ఒండ్రు మట్టి పేరుకుపోయాయి. మరోపక్క గోదావరి లంకల్లో నీటమునిగిన పంట పొలాలు తేరుకున్నాయి. సుమారు వారానికి పైగా ముంపులోనే ఉండడంతో పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నదీ తీరంలోని ఇసుక ర్యాంపులను వరద ముంచెత్తడంతో ర్యాంపుల్లోకి వెళ్లే బాటల్లో ఒండ్రు మట్టి మేటలు పడ్డాయి.

యూటీఎఫ్ నేతకు ఘనంగా వీడ్కోలు సన్మానం



ఉస్సే శంకరుడు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, వివిధ పార్టీల నాయకులు

దేవరపల్లి: స్థానిక ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఉస్సే శంకరుడు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీలక్ష్మి అధ్యక్షతన ఆ పాఠశాలలో నిర్వహించిన ఆయన వీడ్కోలు సన్మాన కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, యూటీఎఫ్ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, పలువురు ఉపాధ్యాయులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ కేవీకే దుర్గారావు ఉపాధ్యాయుడు శంకరుడు మాస్టారు పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల అభివృద్ధికి కూడా పాటుపడ్డారంటూ కొనియాడారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకర్, జిల్లా కార్యదర్శి షరీఫ్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు, ఎంఈఓ ఎం.తిరుమలదాస్ తదితరులు శంకరుడు సేవలను కొనియాడారు. అనంతరం శంకరుడు, వీరవెంకట కుమారి దంపతులను ఘనంగా సన్మానించి నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కేఆర్ఎస్‌వీవీ అప్పారావు, మానవత సంస్థ జిల్లా ప్రతినిధి బళ్ల సూర్యచక్రం, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పప్పు వెంకట రామారావు, బండి సూర్యప్రకాశరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కొయ్యలమూడి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పోతవరం పీహెచ్‌సీలో కలెక్టర్ తనిఖీ

- విధుల్లో లేని డ్యూటీ డాక్టర్ వెంకట్రావు
- అటెండెన్స్, మూమెంట్ రిజిస్టర్ స్వాధీనం
- సిబ్బంది నుంచి లిఖిత పూర్వక స్టేట్‌మెంట్ల రికార్డు



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

నల్లజర్ల: బదిలీపై వెళ్లిన ఏఎన్‌ఎం చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం మధ్యాహ్నం పోతవరం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో డాక్టర్ రాజశేఖర్ సెలవులో ఉండగా డ్యూటీలో ఉన్న మరో డాక్టర్ వెంకట్రావు పీహెచ్‌సీలో లేరు. ఇంత వరకూ ఓపీ చూశారని ఇపుడే బయటకు వెళ్లినట్టు సిబ్బంది కలెక్టర్‌కు చెప్పారు. అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం ఉంది. మూమెంట్ రిజిస్టర్‌లో చీపురుగూడెం పంచాయతీకి వెళ్లినట్టు పేర్కొన్నారు. డాక్టర్‌కు ఫోన్ చేస్తే స్పందించలేదు. దీంతో కలెక్టర్ ప్రశాంతి స్వయంగా పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసి డాక్టర్ వెంకట్రావు మీ దగ్గర ఉన్నారా? అని వాకబు చేశారు. ఆయన ఇక్కడకు రాలేదని సమాధానం రావడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. డెలివరీలు ఎక్కడ జరుగుతున్నాయి. వ్యాక్సినేషన్ ఎక్కడ అంటూ కలెక్టర్ సిబ్బందిని ప్రశ్నించారు. ఇటీవలే ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన ఏఎన్‌ఎం రామలక్ష్మికి, ఆశా కార్యకర్తలకు మధ్య తగాదా ఏమిటంటూ కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అందరి వద్దా స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. అటెండెన్స్, మూమెంట్ రిజిస్టర్‌లను కలెక్టర్ వెంట తీసుకెళ్లారు. పీహెచ్‌ఎన్ ఇందిర, హెచ్‌వీ మీరాబాయి, ఫార్మాసిస్ట్ వెంకటేశ్వరరావు, స్టాఫ్ నర్స్ భవానీ, సూపర్ వైజర్ సత్యం ఆ సమయంలో పీహెచ్‌సీలో ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

పోతవరం పీహెచ్‌సీ పక్కనే ఉన్న నంబర్ –47 అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. ఎంతమంది పిల్లలు హాజరయ్యారు? వారికి ఆహారం ఏం పెడుతున్నారు? అని కార్యకర్త నిమ్మకమారిని ప్రశ్నించారు. కోడిగుడ్లు ఇంత చిన్నగా ఉన్నాయేమిటని అడిగారు. మొత్తం 10 మందికి ఏడుగురు పిల్లలు వచ్చారని కార్యకర్త బదులిచ్చారు. వారిలో ముగ్గురు పడుకొని ఉన్నారు. మిగిలిన వారిని గోడపై ఉన్న బొమ్మలు, పండ్ల పేరు ఏమిటని కలెక్టర్ అడిగారు.

ఆరోగ్యంగా సేంద్రియ వరి పంట

- జిల్లా మేనేజర్ బొర్రా తాతారావు
- ప్రకృతి వ్యవసాయంపై రెండు రోజుల పాటు రైతులకు శిక్షణ



జీవన ఎరువుల తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

దేవరపల్లి/నల్లజర్ల: ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపుతున్నారని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజరు బొర్రా తాతారావు బుధవారం తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు వివిధ పంటల సాగుపై వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రెండు రోజుల పాటు దేవరపల్లి మండలం దుద్దుకూరు, నల్లజర్ల మండలం సింగరాజుపాలెం గ్రామాల్లో శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. పంటలకు రసాయన ఎరువులు, పురుగు మందులు తగ్గించి సేంద్రియ ఎరువులు, కషాయాలు, గ్రోత్ ప్రమోటర్ వాడాలని ఆయన రైతులకు సూచించారు. దీనిపై రైతులకు డిమానిస్ట్రేషన్ చేసి అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 34 వేల మంది రైతులు 37 వేల ఎకరాల్లో సేంద్రియ సాగు చేస్తున్నట్టు తాతారావు చెప్పారు. ఇందులో 27 వేల ఎకరాల్లో వరి పంట సాగులో ఉందని, మరో 10 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు వేసినట్టు వివరించారు. వరి చేలు ఆరోగ్యకరంగా ఉన్నాయని తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కరుణశ్రీ, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.రాఘవేంద్రరెడ్డి, డాక్టర్ ఎన్.చిరంజీవి, గోపాలపురం డివిజన్ ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ సోమిశెట్టి శ్రీనివాస్ రైతులకు శిక్షణ ఇచ్చినట్టు తాతారావు చెప్పారు.

హౌసింగ్ బిల్లులకు ఎలాంటి జాప్యం లేదు

నల్లజర్ల: గోపాలపురం నియోజకవర్గంలో బలహీన వర్గాల గృహ నిర్మాణాల బిల్లులు అప్‌లోడ్ చేయడంలో ఎలాంటి జాప్యం లేదని హౌసింగ్ డీఈ శేఖర్‌బాబు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా కొద్ది రోజులు నిలిచి పోయిన తర్వాత ఈ ప్రక్రియ యథావిధిగా జరుగుతోందన్నారు. బిల్లుల మంజూరుకు నిధులు విడుదల చేయడం అనేది ప్రభుత్వ నిర్ణయం అన్నారు.ఈ విషయంలో ఎటువంటి అపోహలకు తావులేదన్నారు. లబ్ధిదారులకు అనుమానాలుంటే స్వయంగా గాని, ఫోన్ ద్వారా తమ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

మెరుగైన పారిశుధ్యానికి చర్యలు తీసుకోండి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదేశం



చెత్త తరలించే ట్రాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: పట్టణంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదేశించారు. మునిసిపాలిటీ పరిధిలో చెత్త సేకరణకు వినియోగించే ట్రాలీలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి వీటిని కొనుగోలు చేసినట్టు చైర్ పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన బ్లీచింగ్, ట్రాలీలు, డస్ట్‌బిన్ల కోసం సుమారు రూ.7 లక్షలు వెచ్చించినట్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ తెలిపారు. మున్సిపల్ మేనేజర్ రాధాకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, కౌన్సిలర్లు బి.సత్యనారాయణ, కండెల్లి రామారావు, వెంకటరమణలతో పాటు నాయకులు పెనుమాక జయరాజు, బీవీ ముత్యాలరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వన మహోత్సవం

తాళ్లపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హామీ ఇచ్చారు. మండలంలోని గజ్జరం, అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో బుధవారం వన మహోత్సవం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ముప్పిడి కొబ్బరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలల మైదానాల్లోని పిచ్చి మొక్కలు, పెరిగిన గడ్డి, టాయిలెట్లు శుభ్రం చేయిస్తామన్నారు. పాఠశాలల్లో తరగతి గదుల కొరత లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త అల్లూరి విక్రమాదిత్య, అన్నదేవరపేట సర్పంచ్ ఎలిపే సుధారాణి, నాయకులు పాల్గొన్నారు.

ఏటీఎల్ లక్ష్యాలను సాధించాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నీతి అయోగ్ పరిధిలోని అటల్ ఇన్నోవేషన్ మిషన్‌కు సంబంధించి దేశంలోని పాఠశాలల్లో స్థాపించిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల లక్ష్యాలను సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఈఓ కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక ట్రైనింగ్ కళాశాలలో బుధవారం జిల్లాలోని ఏటీఎల్ ల్యాబ్‌లున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ దేశంలో ఒక మిలియన్ మంది పిల్లలను నియోటెరిక్ ఇన్నోవేటర్లుగా తీర్చిదిద్దేందుకు, యువకుల్లో ఉత్సుకత, సృజనాత్మకత, ఊహాశక్తిని పెంపొందించడం, డిజైన్ మైండ్‌సెట్, కంప్యూటేషనల్ థింకింగ్, అడాప్టివ్ లెర్నింగ్, ఫిజికల్ కంప్యూటింగ్ తదితర నైపుణ్యాలను పెంపొందించడం ఈ పథకం లక్ష్యమని వివరించారు. జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీ ఎస్.సుభాషిణి మాట్లాడుతూ ఏటీఎల్ అనేది అటల్ ఇన్నోవేషన్ మిషన్ పేరుతో గొడుగు మిషన్ కింద నిర్వహించే ప్రాజెక్టు అన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా జిల్లా ఏఎంఓ గౌరీశంకర్, సీఎంఓ శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి నెహ్రూ, ఏటీఎల్ ఇన్‌చార్జి బీవీఎల్ఎన్ ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో ఇంటర్ ఎంతో కీలకం



పుస్తకాలు పంపిణీ చేస్తున్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య ఎంతో కీలకమని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువు పూర్తి చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. ప్రభుత్వం సమకూర్చిన పుస్తకాలను బుధవారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ మోడరన్ రూఫ్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపాల్ బట్టు గీతాంజలి అధ్యక్షత జరిగిన సమావేశంలో మంత్రి దుర్గేష్ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, డీవీఈవో జేవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సర్వ శిక్ష అభియాన్ పీవో ఎస్.సుభాషిణి, కౌన్సిలర్ ఎండీ షకీరాబేగం, ఎంఈఓ గణేష్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పిస్తాం



వసతి గృహంలో వార్డెన్‌కు సూచనలు ఇస్తున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి శశాంక

నిడదవోలు రూరల్: సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు జిల్లా బీసీ సంక్షేమాధికారి పి. శశాంక అన్నారు. మండలంలోని సమిశ్రగూడెంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని బుధవారం రాత్రి ఆమె సందర్శించారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం అందించాలని హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు సూచించారు. పదో తరగతి విద్యార్థినులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక ప్రణాళికతో వారిని చదివించాలని శశాంక ఆదేశించారు. ఏఎస్‌డబ్ల్యూ రామకృష్ణ, వార్డెన్ పి.సరోజ, సిబ్బంది పాల్గొన్నారు.

పంట కుళ్లి.. కళ్లు చెమ్మగిల్లి



పెరవలి మండలం ముక్కామల వద్ద దెబ్బతిన్న బెండ తోట



ఖండవల్లిలో కుళ్లిపోయిన కంద గొడుగులు



లంకమాలపల్లిలో దెబ్బతిన్న బొప్పాయి తోట

పెరవలి: కూరగాయలు, ఆకుకూరలు, వివిధ రకాల పండ్లు, పూల తోటలతో ఏడాది పొడవునా పచ్చగా కనువిందు చేసే గోదావరి లంక భూములు దుర్వాసన వేస్తున్నాయి. పంటలు కుళ్లి పోవడంతో రైతులు పట్టుమని పది నిముషాలు కూడా తమ పొలాల వద్ద ఉండలేక పోతున్నారు. ముక్కు మూసుకుని ఇంటిబాట పడుతున్నారు. గోదావరికి వరద తగ్గుముఖం పట్టడంతో లంకలు నెమ్మదిగా ముంపు నుంచి బయట పడుతున్నాయి. రోజుల తరబడి నీట మునిగిన పంటలు మట్టితో నిండిపోయి కుళ్లిపోయాయి. ఇక్కడ పెరిగే పచ్చగడ్డి మొత్తం కుళ్లిపోవడంతో పశువులకు పచ్చిమేత కరవైంది. రైతులు వాటికి ఎండుగడ్డి వేస్తున్నారు. మరోపక్క పల్లపు ప్రాంతాల్లోని పంటలు నేటికి నీటిలోనే ఉన్నాయి. అరటి, బొప్పాయి, తమలపాకుల తోటలు ముగ్గిపోతుండగా అరటి గెలలు పండిపోతున్నాయి. పూలతోటలు, కూరగాయల పంటలు నామ రూపాల్లేకుండా పోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. వంగ, కంద, గులాబీ తోటలు కుళ్లిపోయి మోడుల్లా దర్శనం ఇవ్వడంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ముఖ్యంగా కంద, అరటి పంట వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆరుగాలం శ్రమించి వేసిన పంటలు గంగ పాలవడంతో అప్పు మిగిలిందని వాపోతున్నారు.

677 హెక్టార్లలో పంటలకు నష్టం

మండలంలోని మొత్తం మూడు వేల ఎకరాల్లోని లంక పంటలన్నీ నీట మునిగాయి. వాటిలో కొబ్బరి, కోకో, పామాయిల్, జామ తోటలు పాక్షికంగా దెబ్బతిన్నా, మిగిలిన పంటలన్నీ పూర్తిగా పాడైపోయాయి. మండలంలోని 677 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేసినట్టు ఉద్యాన అధికారి సీహెచ్ శ్రీనివాస్ (కొవ్వూరు) వెల్లడించారు. ఏయే పంటలకు ఎంతమేర విస్తీర్ణంలో నష్టం వాటిల్లిందో పూర్తిగా నీరు తగ్గిన తరువాత అంచనాలు వేస్తామని వివరించారు.